https://teluguislam.net



# అల్లాహ్ అద్వితీయుడైన దయాసాగరుడు

సర్వ ప్రశంసలు, సర్వ పొగడ్తలు అల్లాహ్‌కు మాత్రమే శోభనీయం. ఆయన అపార కరుణామయుడు పరమకృపాశీలుడు, దయామయుడు. అల్లాహ్ కారుణ్యం ప్రతి ఒక్కరిని ఆవరించి ఉంది. ఆ మహా ప్రభువు ఒక్కడే, ఆయనే నిజమైన ఆరాధ్యుడు, ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ దాసుడు మరియు చిట్టచివరి ప్రవక్త. ఆయన సర్వ మానవాళిని గొప్పగా ప్రేమించేవారు, ప్రపంచానికి పవిత్రమైన ప్రేమానురాగాలను నేర్పిన మహోపకారి. ప్రాణ శత్రువులను సహితం క్షమించిన గొప్ప గుణవంతుడు. దైవభీతితో నడుచుకున్న మహా భక్తుడు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పరలోకంలోనూ ప్రజల కొరకు అల్లాహ్ దగ్గర మహా సిఫారసు చేసే గొప్ప భాగ్యాన్ని పొందినవారు. తన సముదాయంలోని ప్రజల పెద్ద పెద్ద పాపాలను క్షమించవలసిందిగా అల్లాహ్‌ను వేడుకునేవారు. అల్లాహ్ పట్ల రవ్వంత విశ్వాసం గల ప్రజలను నరకం నుండి వెలికితీసి స్వర్గానికి చేరవేసే బాధ్యతను తీసుకున్న మహోపకారి మన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం).

అల్లాహ్ మరియు ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ప్రేమానురాగాలను ప్రజలు పొందాలంటే! నిశ్చయంగా వారు ఇష్టపడిన మార్గాన్నే ఎన్నుకోవాలి. మరియు వారు చెయ్యమన్న కార్యాలనే సక్రమంగా చెయ్యాలి. వారు ఇష్టపడిన గుణగణాలను తెలుసుకొని వాటికి

https://teluguislam.net



అనుగుణంగా నడుచుకోవాలి. మరియు వారు ఇష్టపడే మాటలనే మాట్లాడాలి. వారు ఇష్టపడే ఆరాధన విధానాలనే పాటించాలి. వారి కొరకై ప్రతి కార్యంలోనూ పూర్తి చిత్తశుద్ధిని ప్రదర్శించాలి. చివరికి వారి ప్రేమాభిమానంతో మన హృదయాలు నిండిపోవాలి.

ఎందుకంటే? అల్లాహ్‌యే సర్వలోక సృష్టికర్త. ఆయనే తల్లి గర్భంలో పిండం పడినప్పటి నుండి జన్మించే వరకు ఆ పసికందుల్ని పరిరక్షించినవాడు, ఆయనే స్త్రీ గర్భంలో అందమైన ఆకారాన్ని తీర్చిదిద్దినవాడు, వారు పుట్టిన తరువాత తల్లి చనులలో పాలును నింపినవాడు, ఆ పిల్లలకై తల్లి మనసులో అపారమైన ప్రేమను నింపినవాడు. ఆ అల్లాహ్‌యే ప్రతి ఒక్కరికి సుఖసంతోషాలను ప్రసాదించేవాడు, కష్టాలలో ఆదుకునేవాడు, రోగులను బాగు చేసేవాడు. పాపాత్ములను కనికరించి క్షమించేవాడు, నరకాగ్ని నుండి రక్షించేవాడు. మరియు విశ్వాసులందరినీ తన కృపా కటాక్షాల ఛాయలో తీసుకొని స్వర్గాన్ని ప్రసాదించేవాడు ఆ అల్లాహ్‌యే!.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘ఆయనే తాను కోరిన విధంగా మాతృ గర్భాల్లో మీ రూపురేఖలను మలుస్తాడు. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన శక్తి సంపన్నుడు, వివేక సంపన్నుడు కూడాను.’’[1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘తాను కోరిన వారికి ఆడ పిల్లల్ని ఇస్తాడు, తాను కోరిన వారికి మగ పిల్లన్ని ఇస్తాడు. – లేదా వారికి మగ పిల్లలను, ఆడ పిల్లలను కలిపి ఇస్తాడు. మరి తాను కోరిన వారిని సంతాన హీనులుగా చేస్తాడు. ఆయన మహా జ్ఞాని, సంపూర్ణ అధికారం కలవాడు’’[2]

---

[1] (సూరతు ఆల ఇమ్రాన్: 6).

[2] (సూరతుష్ షూరా:49–50).

https://teluguislam.net



కనుక అల్లాహ్‌ను హృదయ పూర్వకంగా ప్రేమించాలన్నదే మానవ జీవిత లక్ష్యం. ఆయన ఇష్టాయిష్టాలను తెలుసుకొని చివరి శ్వాస వరకు ఆయన పట్ల కృతజ్ఞతా భావంతో జీవించడమే ధన్యం.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరియు మీరు అల్లాహ్ అనుగ్రహాలను లెక్కపెట్టదలచినా, మీరు వాటిని (లెక్కింపలేరు)లెక్క పెట్టలేరు. నిశ్చయంగా అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణప్రదాత.''[1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరి ఆయనే మీరు అడిగిన దానినెల్లా మీకు ఇచ్చి ఉన్నాడు. మీరు అల్లాహ్ చేసిన మేళ్లను లెక్కించదలిచినా లెక్కించలేరు. నిశ్చయంగా మానవుడు మహా అన్యాయపరుడు. మేలును మరిచేవాడు.''[2]

అంటే; మీరు అర్థించిన మీ జీవితావసరాలన్నింటినీ ఆయన మీకు సమకూర్చాడు. అంతే కాదు – మీరు అడిగిన దాన్నీ ఆయన ఇస్తున్నాడు. మీరు అడగని దాన్ని కూడా ఇస్తున్నాడు. ఎందుకంటే? మీకు ఏ ఏ వస్తువులు అవసరం ఉందో, అవి లేకపోవటం వల్ల మీ మనుగడకు ఎలా ముప్పు వాటిల్లుతుందో ఆయనకు తెలుసు. ఒక్క మాటలో చెప్పాలంటే భూమండలంపై మీ జీవన వ్యవస్థకు సంబంధించిన సకల వస్తుసామగ్రిని ఆయన మీకు ప్రసాదిస్తున్నాడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఇది అల్లాహ్ అనుగ్రహం. ఆయన తాను కోరిన వారికి దీనిని ప్రసాదిస్తాడు. అల్లాహ్ గొప్ప అనుగ్రహం కలిగినవాడు.''[3]

---

[1] (సూరతున్ నహ్ల్:18).
[2] (సూరతు ఇబ్రాహీం:34).
[3] (సూరతుల్ జుముఅహ్:4).

https://teluguislam.net



మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘అల్లాహ్ అనుగ్రహము, ఆయన దయా దాక్షిణ్యాలే గనక మీపై లేకుండా పోతే (మీరు కష్టాల పాలయ్యేవారు) అల్లాహ్ పశ్చాత్తాపాన్ని ఆమోదించేవాడు, వివేకవంతుడు.’’[1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘అల్లాహ్ దయానుగ్రహాలే గనుక మీపై లేకపోయినట్లయితే (మీ నిర్వాకానికి గాను ఇప్పటికే శిక్ష అవతరించేది) అల్లాహ్ ప్రేమామయుడు, కనికరం కలవాడు.’’[2]

మరియు ఒక హదీసులో ఇలా ఉంది; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

అల్లాహ్ తన దాసులలో ఎవరినయినా ప్రియతమునిగా చేసుకున్నప్పుడు, **జిబ్రయీల్ (అలైహిస్సలామ్)ను పిలిచి:** ‘‘నిశ్చయంగా నేను ఫలాన దాసుణ్ణి ప్రేమిస్తున్నాను. నువ్వు కూడా అతన్ని ప్రేమించు’’ అని అంటాడు.

**తరువాత జిబ్రయీల్:** ఎంతో జాగ్రత్తగా ఆ విషయాన్ని అల్లాహ్ సింహాసనం మోసే దూతలకు తెలుపుతాడు. అల్లాహ్ సింహాసనాన్ని మోసే దూతలు ఆ విషయం గురించి చర్చించుచుండగా ఆకాశంలో ఉన్న దూతలందరూ వింటారు. అంతే! ఏడవ ఆకాశంలో ఉన్నవారంతా ఆ వ్యక్తిని ప్రేమించసాగుతారు.

అలాగే ఒకొక్క ఆకాశంలో ఉన్నవారంతా ఆ వ్యక్తిని ప్రియతమునిగా ప్రేమిస్తారు. మరియు భూమ్యాకాశాలకు ఆ విషయం చేరవేయబడతుంది. అలా భూమిపై ఉన్నవారి వద్దకు (అతని కీర్తి ప్రతిష్ఠలు) చేరవేయబడతాయి.

---

[1] (సూరతున్ నూర్:10).

[2] (సూరతున్ నూర్:20).

https://teluguislam.net



చివరికి భూ మండలంలో ఉన్నవారంతా ఆ వ్యక్తిని ప్రియతమునిగా చేసుకుంటారు..'' [1]

అల్లాహ్ సర్వ మానవుల పట్ల దయా దాక్షిణ్యాలు కలిగిన ఏకైక ప్రేమామయుడు. ఆయనే మా పొరపాట్లను క్షమించేవాడు. మరియు గొప్ప అనుగ్రహాలు కలిగినవాడు. ఆ అనుగ్రహాలు పొందుటకై ప్రజలను అల్లాహ్ ఇలా పిలుపునిచ్చాడు:

''రండి! మీ ప్రభువు క్షమాభిక్ష వైపు పరుగెత్తండి. ఇంకా భూమ్యాకాశాలంత వెడల్పు గల స్వర్గం వైపు పరుగిడండి. అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలను విశ్వసించే వారికోసం అది తయారు చేయబడింది. ఇది అల్లాహ్ అనుగ్రహం! ఆయన దీనిని తాను కోరిన వారికి ఇస్తాడు. అల్లాహ్ గొప్ప అనుగ్రహం కలవాడు.'' [2]

హ॥జ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''సత్యంగా! అల్లాహ్ ఎవరినైతే ఇష్టపడుతాడో వారిని నరకంలో వేయడు.'' [3]

---

[1] (బుఖారీ:5580, సహీహ్ లిల్ అల్బానీ–ముఖ్తసర్ అల్ ఉలువ్: 1/75).

[2] (సూరతుల్ అల్‌హదీద్: 21).

[3] (హాకిమ్:4/177, 7347, సిల్‌సిలతుస్ సహీహా లిల్ అల్బానీ: 5/531, 2407).